# ముగ్గురు ముగుదల మృతి

[ చిన్నకథ ]

...యౌవనము, మాతృత్వము అనే రెండు గోడలచాటునా మీ దౌర్భాగ్యజీవితాలను దాచుకుందామని ప్రయత్నిస్తున్నారు, ఇంతకంటె వెర్రి ఇంకేముంది ?...

కథకుడు :
## ఏడిద కామేశ్వరరావు



కథకుడు.

ముగ్గురు స్త్రీలు రైల్వేలైను వెంబడి నడుస్తూ వెళుతున్నారు.

వాళ్లు ఏ జాతివాళ్లో, ఏ కులం వాళ్లో, ఆలా ఎక్కడికి వెడుతున్నారో మొదలైన విషయాలతో కథకు నిమిత్తం లేదు.

రైల్వేలైను కూడా ఎక్కడ పుట్టి ఎక్కడకు పోయిందో కూడా -కథకు అక్కర్లేదు.

వాడిచూపుల్లా భూనభోంతరాళంలోకి దూసుకుపోతున్నట్లుగా ఆ రైల్వేలైను, కనుచూపు మేరను కూడా దాటి ప్రాకిపోతూ వుంది-

ఆ ముగ్గురు స్త్రీలు అలా నడుస్తూనే వున్నారు.

ఒకామె బిచ్చకత్తె...

కట్టుకున్న గుడ్డలు పాత పూరికొంపమీది తాటాకుల్లా వేళ్లాడుతున్నై. వస్త్రంలేని శరీరభాగం మన్ను కొట్టుకునిపోయి వుంది. సంరక్షణలేని జుట్టు ముడిలోంచి వూడిపోయి గాలిలో ఎగురుతోంది. దెబ్బలుతిన్న చాకిరాళ్లలా పాదాలు మోటదేరివున్నాయి. మడవలు పగుళ్లతో గాళ్లుపడివున్నాయి.

ఒకామె పడుచుపిల్ల...

వయస్సు సుమారు యిరవై వుంటాయి. కళ్లల్లో తళతళలు మెరుస్తున్నాయి. మిసమిసలాడుతూ యౌవనం ప్రతి అంగంల్లోను తొంగి కిసలాడుతోంది. నడకలో నిర్లక్ష్యభావం అడుగులు వేస్తోంది. చేతులు వయ్యారంగా గాలిలో యీదులాడుతున్నాయి.

మరొకామె పసిబిడ్డతల్లి...

వెన్ను కలిగిన జొన్నమొక్కలా భారం, హుందా ఆమెలో చిప్పిలుతున్నాయి. ఎడంచేతిలో వున్న సన్నని బిడ్డ ఎర్రటి కళ్లతో ఆమె ఆశాదృక్కుల్ని అప్పుడప్పుడు అప్యాయంగా ఆకర్షిస్తోంది.

ఆ ముగ్గురు మగువలు ఆలా నడుస్తూనే వున్నారు.

ప్రకృతి, వాతావరణంలోని ధ్వని తప్పితే, వారి ముగ్గురినడుమ సంభాషణ ఏమీ నడవలేదు. నిశ్శబ్దంగా, నిదానంగా నడుస్తూనే వున్నారు.

ఇంతలో దూరాన, ఎక్కడో రైలు వస్తూవున్నచప్పుడు వారి కర్ణపుటాలపడ్డది. ఆవెనుక చిన్న మబ్బుతునకలా నల్లని పొగకూడా దృగ్గోచరమైంది.

కళ్లముందు ఎక్కడో దూరాన, రైలుబద్దెలు రెండు ఏకమైపోయి, భూమ్యాకాశాలు రెండూ కలిసిపోతూవున్న ప్రదేశంలో...

రైలు వేగంగానే వచ్చేస్తోన్నట్టు చప్పుడు వ్యక్తం చేస్తోంది.

ఆ ముగ్గురు స్త్రీలు అలా నడుస్తూనే వున్నారు—

"ఇక రెండునిమిషాల్లో రైలు ఇక్కడికి వచ్చేస్తుంది..." అన్నది బిచ్చకత్తె నిరాశగా ముందుకు చూస్తూ...

ఆమె మాటల్లో భయంకరమైన అపాయం సూచితమవడం వారిద్దరూ గ్రహించారు.

"ఏమిటి?...ఏమంటావ్?..." అని ఇద్దరూ ఆమెను ప్రశ్నించారు. భయంతో కరిగిపోయిన కంఠస్వరాలు వారి మనోభిప్రాయాల్ని స్పష్టీకరించలేకపోయాయి.

"నేను చెప్పేదేమిటి? మీకు మాత్రం తెలియదూ!" అంది బిచ్చకత్తె. వారికి సమాధానం చెప్పిందేకాని, ఆమె దృష్టిమాత్రం ముందున, రైలుబద్దెలు రెండు కలుసుకుని పోతూవున్న చోటనే, లగ్నమై వుంది.

• చూస్తూవున్నకొద్దీ ఒక నల్లని చుక్క, అంతకంతకు పెద్దదవుతూ వున్న చుక్క, భూమ్యాకాశాలను రెండూ పెకలించుకుని ముందుకు వురుకుతూన్నట్టు ఆమెకు అవుపించింది.

ఆతృతగా అంది ఆమె.

"ఆ వచ్చే రైలు మన కష్టాలను ఒక్కపెట్టున గట్టెక్కించివేస్తుంది..."

. సమాధానాలు లేనివారి దైనికసమస్యలు, అదీ అంతమూ కనపడని జీవితపు పోరాటాలు, ఉదయాస్తమానాలవలె విసువు విరామమూ లేని కడుపు ప్రశ్న—అనాటితో శేషం లేకుండా తేలిపోనున్నదని ఒక ఆశాలేశం ఆమె రెండు నేత్రాల్లోను తళుక్కుమంది. ఆ మెరుపుతో ఆమె పీక్కుపోయిన రెండు కళ్లు ద్రవించిపోయాయి.

యౌవనాంగి ఆమెవైపు చూచింది.

"నాకు చావాలని లేదు... ఇంకా నేను చిన్నదాన్ని. జీవిత మాధుర్యాన్ని ఇంకా చవిచూడకపోతే ఏం ప్రయోజనం...?" అన్నది. ఆమె బిచ్చకత్తె మాటల్లోని విరక్తిని అవగాహన చేసుకున్నది. కాని మృత్యువుయొక్క క్రీనీడలకు తన లేతకాయాన్ని...బలి చెయ్యడానికి ఆమెకు సాహసం చాలలేదు...

"సరే, నీకు యౌవనం వుంది. కాని వుండి ఏంప్రయోజనం? పురుషుడిచేతిలో ఒక ఆటవస్తువవు అయిపోవడానికి కాకపోతే! కామతృష్ణ తనివితీరా తీర్చుకుంటాడు. అవసరం తీరిపోడంతోటే వాడిపోయిన పూలదండను విసిరినట్టు, నిన్ను అవతల విసిరివేస్తాడు. ఎందుకొచ్చిన యౌవనం?..." అన్నది బిచ్చకత్తె, యౌవనాంగి కేసి నిర్లక్ష్యంగా చూస్తూ.

"ఇదిగో, చూడు. అతణ్ణి ఏమీ అనకు. నేను వినలేను. నన్నతడు గాఢంగా ప్రేమించాడు. కాని తల్లిదండ్రుల మాటకు ఎదురు చెప్పలేకపోయాడు. కాని..."

"అయితే, ప్రేమ అనేదానిలో నీకింకా నమ్మకమున్న దన్నమాట. ప్రేమ! ఎంత చక్కని మాట. ముద్దులుమూట కడుతోంది కదూ? నీవంటివాళ్లని చెరగొనడానికే యీ మాటను సృష్టించాడు పురుషుడు...

నీకు పొంగులువారే యౌవనం వుంది. అది పొంగులువారుతూ వున్నంతసేపు ఒకటి రెండు సంవత్సరాలు నీకు కొన్ని అణాలు సంపాదించి పెడుతుంది. శరీరాన్ని కనాకష్టంగా అమ్ముకున్నాక, పొంగులు చల్లారిపోతాయి. తరవాత...ఆ తరవాత..."

బిచ్చకత్తె గొంతులో గాద్గద్యం సుళ్లుతిరిగింది. కళ్లు రెండూ ఎర్రబడ్డాయి. పెదిమలు తడబడుతూ, వంకర్లు పోయాయి...పైకి ఎత్తిన చెయ్యి వణికిపోతోంది...

"రోగాలతో రొచ్చులతో... ముదిమి నిన్ను ఆవహిస్తుంది. అప్పుడు నువ్వు ఎవరిక్కావాలి! సంపాదన మాట అటుంచినా, బిచ్చమైనా పెట్టరు." అన్నది ఆవేశంతో.

"కాని యౌవనంవున్నంతసేపూ బ్రతికివుండడమే జీవితానికి సార్థకం. అటువంటి జీవితానందం..."

చప్పరించింది. యౌవనాంగి. ఆశతోకూడిన ఆనందం ఆమె ము

ఖంలో చిందులు త్రొక్కింది. బిచ్చకత్తె మాటలను ఖండిద్దామని ఆ యౌవనాంగి ప్రయత్నించింది. కాని, ఆమె మాటల్లోని వేడికి ఝడిసి వూరుకుంది...

బిచ్చకత్తె మళ్లీ ముదలకించింది. కాని యౌవనాంగి నిరుత్తర కావడంతో పక్కకు చూచింది....

“నువ్వేమంటావు? నీకూ భయం వేసేస్తోంది కాబోలు, చావంటే...”

అంది బిడ్డతల్లిని సిలబెట్టి-

“అబ్బ, ఆమాటనకు...”

చకితురాలైంది ఆమె. అప్రయత్నంగా తన గర్భఫలాన్ని రెండు చేతులతోటీ దగ్గరకు లాక్కుని వక్షానికి అదుముకుంది. బిత్తరపోయిన ఆమె కళ్లల్లోంచి జలబిందువులు జలజలరాలాయి.

“...నేను చచ్చిపోగలనా? నా బంగారపు కొండకోసమైనా బ్రతికి వుండొద్దూ?...”

“బంగారం! మాంసపు ముద్దలే మనకి బంగారాలు !!

నీ దౌర్భాగ్య జీవితానికి అది ఒక మచ్చుతునక. సంఘంలోని అన్యాయాలకు ఘోరాలకు బలి అయిపోయి, చక్కని చిహ్నంగా నువ్వు ఏర్పడ్డావా? యిక నీకు మాత్రం మచ్చుముక్క లెందుకు?

“ఔను, నాకూ తెలుసును. అయినా ఇది నాది; నా బిడ్డ... నా రక్తంలోని రక్తం...”

“రక్తం...ఎక్కడుంది? తుపానులా వర్షం కురుస్తూవుంటే సూదుల్లా చలి చిల్లులు పొడుస్తూవుంటే, ఆనాటిరాత్రి నిన్ను బయటకు గెంటివేస్తూ మీ నాన్నా, అమ్మా ఇది ఆలోచించారా? రక్త సంబంధం...”

“ఇదిగో...చావంటే నాకేం భయం లేదు, నేను దానికి తగిన




పసిబిడ్డల్ని
ఉల్లాసంతో
ఊరిస్తుంది
ఊగిస్తుంది
ఉరుకుపెత్తిస్తుంది
మందాన్ని విదలిస్తుంది
మాటలాడిస్తుంది
ఆటలాడిస్తుంది
మంచిముత్యాల్ని
మరపించు
మంచిరూపం
ఇస్తుంది

అశ్విన్ కుమార్ ఫార్మసీ, నర్సాపురం.

దాన్ని కనక. పైగా దానివల్ల నా కష్టాలు పూర్తిగా తీరిపోతాయి కూడాను...కాని. వీని గతేంకాను? నువ్వు కొంచెం దగ్గరకు చేరదీసి ఆదరిస్తావా? నేను చచ్చిపోయిన తర్వాత...?''

''నీతోపాటు వాణ్ణికూడా చచ్చిపోనీ. ఎందుకూ ఉపయోగంలేని ఒక ముష్టిజీవం తగ్గినా తగ్గడమే యీ ప్రపంచంలో, వాణ్ణి బ్రతికించి మాత్రం ప్రయోజన మేమిటి? వాడికి ఏమంత మంచి భవిష్యత్తును ఏర్పరచగలవు నువ్వు?''

బిడ్డతల్లి గుండెల్లో గుబగుబలు బయలుదేరినై. బిడ్డను మనసారా గుండెలకు హత్తుకుంది. తనివితీరా వాని అమాయకపు నేత్రాల్లోకి చూచి బుగ్గలు ముద్దెట్టుకుంది. ఆ పాదమస్తకం వాణ్ణి మృదువుగా నిమిరివేసింది.

ముసలిదానికి మరి సమాధానం చెప్పటం మానివేసింది.

బిచ్చకత్తె బింకంగా అడుగులు వేస్తోంది. ఆమె వాలకం ఆమె దృఢనిశ్చయాన్ని తెలియజేస్తోంది.

దూరాన నల్లని మచ్చమాత్రంగావున్న చుక్క అంతకంతకు పెద్దదైపోతూ ఉరకలు వేసుకుంటూ ముందుకు వస్తోంది.

''సరె...నేనుమాత్రం చనిపోవడానికే నిశ్చయం చేసేసుకున్నాను. లేకపోతే, నాకేముంది, యీ ప్రపంచంలో...''

అంది బిచ్చకత్తె కాస్సేపు పూరుకుని.

''నీకు మతిపోయింది...'' అన్నారు-యౌవనాంగి, బిడ్డతల్లి— ఒక్కమారుగా నిరుత్సాహాన్ని సూచిస్తూ.

''హాహ్హాహ్హా'' అని ఓ పెద్ద వెర్రినవ్వు నవ్వింది బిచ్చకత్తె.

''నాకు మతిపోయిందని అనుకుంటున్నారు కాదూ మీరు? ఇదిగో. మిమ్మల్ని గురించి నేనేమనుకుంటున్నానో చెబుతాను వినండి. మీరు పిరికిపందలు. తెగింపనేది మీలో ఏ కోశాన్నీ లేదు. యౌవనము, మాతృత్వము అనే రెండుగోడలచాటునా మీ దౌర్భాగ్య జీవితాలను దాచుకుందామని ప్రయత్నిస్తున్నారు. ఇంతకంటే వెర్రి ఇంకేముంది? మతిలేనివాళ్లు మీరు కాని, నేను కాదు.. ...ఇక శలవు...''

అంటూ చకచక ముందుకు నడవ నారంభించింది బిచ్చకత్తె.

''ఇదిగో, నువ్వు లేకపోతే, మేము బ్రతకలేము. నువ్వు చనిపోతే, మేముకూడా చచ్చిపోవలసిందే...''

అన్నారు ఇద్దరూ వణికిపోతూ, అంటూ ఆమెను ఆపడానికని సర్వశక్తులా ప్రయత్నించారు.

రైలు ఇంక ఎంతోదూరంలో లేదు. కొన్ని గజాలదూరంలోకి వచ్చేసింది. అంతజోరులోను ఇంజను కెవ్వున యీలవేసింది. ఇంజను డ్రైవరు చట్టున బ్రేకులగొలుసు లాగాడు. లాగాడు కాని అప్పటి కప్పుడే అంతా మించిపోయింది.

పెద్ద చప్పుడు చేసుకుంటూ కుదుపుకుంటూ ఇంజను కొంతదూరంలో ఆగింది. ఇంజనులోనివాళ్లు చక్రాల నంటిపెట్టుకునివున్న రక్తాన్ని, మాంసాన్ని, ఎముకల్ని ఊడలాగడానికి క్రిందకు దిగారు.

అపుడే బిలబిల వచ్చేశారు రైలులోవున్న జనసమూహం ఎంతో ఆతృతగా...

ఒకడు అన్నాడు :

''ఆ! ఎవరో ఒక బిచ్చకత్తె. పోనిద్దూ''

మరొక డన్నాడు .

''అరే! ఒక యౌవనాంగి. అందంగాకూడా వున్నదే...''

ఇంకొక అత డన్నాడు:

''రామ, రామ. ఆమె ఒక బిడ్డతల్లి...పాపం...''

''ఒక ఆడమనిషి చచ్చిపోయింది...'' అన్నా డొక ప్రేక్షకుడు, ''ఏమిటది?'' అని అడుగుతూ, చూడటానికి అప్పుడే వచ్చిన మరొకనితో.

ఆయా మాటలను వింటూనే, ఆ సంఘటనలోని బాహ్యవిషయాలనే కాక, అంతర్విషయాలను కూడా నిశితదృష్టితో పరీక్షించిన ఒక వేదాంతి అన్నాడు, జనసమూహంలో నుంచుని :

''కాదు. ఒక స్త్రీ కాదు. ముగ్గురు స్త్రీలు.''